బదిలీల సహాయ కేంద్రం ఏర్పాటు : యుటిఎఫ్

ప్రజాశక్తి- కడప అర్బన్ : ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి కడప యుటిఎఫ్ భవన్‌లో సహాయ కేంద్రం ఏర్పాటు చేసినట్లు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు. గురువారం యుటిఎఫ్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉపాధ్యాయ బదిలీల చట్టాన్ని తీసుకొచ్చి మొదటిసారిగా బదిలీలు నిర్వహిస్తుందని చెప్పారు. ఇందుకు సంబంధించిన ఏవైనా సమస్యలు, ఆన్‌లైన్‌లో దరఖాస్తు, బదిలీల ప్రక్రియలో తలెత్తే సమస్యలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించడానికి సహకార కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బదిలీలకు అర్హత కలిగిన ఉపాధ్యాయులందరూ ఇబ్బందులకు గురికాకుండా వారికి మార్గదర్శకత్వం అందించే విధంగా బదిలీల ప్రక్రియ ముగిసే వరకు యుటిఎఫ్ భవన్‌లో సహకార కేంద్రాన్ని నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయులందరూ అవకాశాన్ని ఉపయోగించుకుని బదిలీలలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్త వహించగలరని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఏజాస్ అహమ్మద్, జిల్లా కార్యవర్గ సభ్యులు గోపీనాథ్, ప్రకాష్ బాబు, విజయచంద్రారెడ్డి, గంగన్న, మహబూబ్ బాషా, శివప్రసాద్, ప్రభాకర్, నరసింహులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'ఉపాధి' పనులు

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం : ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-చిన్నమండెం

అర్హులందరికీ ఉపాధి హామీ పనులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వండాడి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీలతో పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం ద్వారా కూలీలకు బిల్లులు సకాలంలో అందుతున్నాయా లేదా అని వారిని అడిగి తెలుసుకున్నారు. మండలంలో అర్హులందరూ ఉపాధి పనులకు వచ్చే విధంగా తోటి కూలీలు వారిని ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి సంబంధించిన కూలీలకు అన్ని వసతులు ఏర్పాటు చేసి పనులు కల్పిస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఉపాధి పనులకు వెళ్లి ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు.

ముస్లింల సంక్షేమానికి కృషి : ముస్లిం సోదరులు ఎటువంటి సమస్యలున్న తమ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవచ్చని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. పలువురు ముస్లిం మత పెద్దలు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముస్లింల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలోని ముస్లింలకు ఎటువంటి సమస్యలున్న వెంటనే తమ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవచ్చునన్నారు. నియోజకవర్గంలోని హిందూ ముస్లింలు కలిసి మెలిసి జీవించి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలన్నారు.

మహా భారతానికి రూ.1.16 లక్షల విరాళం : మండలంలో నిర్వహించే మహాభారతం సందర్భంగా రూ.1.16 లక్షలు విరాళం ఇవ్వనున్నట్లు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి నిర్వహకులకు సూచించారు. మహాభారతానికి జిల్లా, రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు విశేష సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు ఏర్పాటు చేయాలని మహాభారతం నిర్వాహకులకు సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత : ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని అధికారులు ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి బాధితులకు చేయాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో మంత్రి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న వివిధ శాఖల అధికారులు ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిచ్చి బాధితుల సమస్యలు పరిష్కరించాలన్నారు. సమస్యలు పరిష్కరించినప్పుడే ప్రజలకు అధికారులపై నమ్మకం ఏర్పడుతుందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య కారణంగా ప్రజలు తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బాధితుల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించి వారికి న్యాయం చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఏ ఒక్కరు కూడా సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో ముందుకు వెళుతుందని అధికారులందరూ ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి వారికి న్యాయం చేయాలన్నారు. మంత్రి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల అర్జీలు స్వీకరించి వారి సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

రాయచోటి : జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని స్టేట్‌గెస్ట్ హౌస్‌లో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఏ ఒక్కరు సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వచ్చే సమస్యలన్నీ ఎప్పటికప్పుడూ సంబంధిత అధికారులకు తెలియజేసి తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల అర్జీలు స్వీకరించి వాటిని అక్కడికక్కడే పరిష్కరించారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి : సిఐటియు

నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మున్సిపల్ కార్మికులకు పెండింగ్ ఉన్న మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమంలో భాగంగా గురువారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు పురపాలక కార్యాలయం వద్ద నిరసన తెలుపారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రాజంపేట పురపాలక పరిధిలో 15 మంది బదిలీ కార్మికులకు మూడు మాసాల నుంచి వేతనాలు ఇవ్వలేదని, పలుమార్లు అధికారులు కలిసి విన్నవించుకున్నా బిల్లులు పెట్టాము రావడం లేదని చెప్పడం తప్ప, సమస్య పరిష్కరించిన దాఖలాలు లేవన్నారు. వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని, విరమణ పొందిన కార్మికులకు ప్రతినెలారూ.5 వేలు పింఛన్ మంజూరు చేయాలని, సబ్బులు, నూనె వంటి నిత్యావసర సరుకులు అందజేయాలని కోరారు. కార్మికులకు ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యానికి రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు ఖర్చు చేసుకుని కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, కార్మికులకు ఇఎస్ఐ సౌకర్యం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి.రమణ, ప్రసాద్, బుజ్జమ్మ, గంగయ్య, సురేష్, ప్రమీల పాల్గొన్నారు.

కార్యకర్తలకు నిరంతరం అండగా ఉంటా : 'చమర్తి'

రాజంపేట : మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు జగన్‌మోహన్‌రాజు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కార్యకర్తలకు నిరంతం అండగా ఉంటానని టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. గురువారం మినీ మహానాడు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం అందుబాటులో ఉండడమే తన లక్ష్యమని తెలిపారు. రాజంపేట నియోజకవర్గం నుండి 30 వేల మందితో కడపలో అడుగుపెట్టి చంద్రబాబు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టు కుందామని పిలుపునిచ్చారు. సీనియర్ నాయకుల సూచనలతో నాయకులు, కార్యకర్తలు అండదండలతో అందరి సహకారంతో రాజంపేటను అభివృద్ధి దిశగా నడిపించడమే కాకుండా, తెలుగుదేశం పార్టీని తిరుగులేని శక్తిగా తయారుచేసి, కష్టపడ్డ ప్రతి కార్యకర్త టిడిపి పార్టీలో ఉన్నందుకు గౌరవంగా మాట్లాడుకునేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. వైసిపి వారికి టిడిపి పార్టీ అంటేనే చాలా ప్రేమని, అందుకే ఎప్పుడు టిడిపి నామస్మరణ చేస్తున్నారని తెలిపారు. మార్గదర్శకుడు నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పనిచేయడం, భవిష్యత్ నాయకుడు నారా లోకేష్ సహకారంతో బాధ్యతలు నిర్వహించడం తనకు ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజంపేట నియోజకవర్గ పరిశీలకులు దుర్గాప్రసాద్, ఆరు మండలాల అధ్యక్షులు, రాష్ట్ర కార్యదర్శులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, మున్సిపల్ కౌన్సిలర్లు, యూనిట్ ఇన్‌ఛార్జులు, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** పసుపు సైనికులు ఆత్మగౌరవంగా జరుపుకునే పండుగే మహానాడని ఎమ్మెల్యే షాజహాన్ బాష అన్నారు. గురువారం నిర్వహించిన మినీ మహానాడులో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధితో పాటు సంక్షేమ ఫలాలను ప్రజలకు అందిస్తూ సుభి క్షమైన పాలన అందిస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీల అభ్యు న్నతే ధ్యేయంగా నియోజకవర్గ అభివృద్ధికి నిస్వార్థంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. గ్రూపు రాజకీయాలకు తావు లేకుండా తెలుగుదేశం కుటుంబ సభ్యులకు నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, టిడిపి నియో జకవర్గం సమన్వయకర్త మార్పూరి సుధాకర్ నాయుడు, రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్, మైనార్టీ నాయకులు ఎస్.ఎ.మస్తాన్, ఎస్.ఎం.రఫీ, నాగూర్ వలి, ఎస్.ఆర్.షంషీర్, సీనియర్ నాయకులు నీలకంఠ, మోడం సిద్ధప్ప, జంగాల వెంకటరమణ, గంగారపు రామూర్తి నాయుడు, పచ్చిపాల రామకృష్ణ ఆచారి, బీదం గురునాథ్ యాదవ్, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు పోతబోలు సుధాకర్, రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ పఠాన్ ఖాదర్ ఖాన్, ముసలికుంట నాగయ్య, 20వ వార్డు కౌన్సిలర్ తులసి, పణికర్ రెడ్డి, నవీన్ చౌదరి, గిరీష్ కుమార్, దొరస్వామి నాయుడు, చిన్న మహేష్, మాజీ కౌన్సిలర్లు బాబు నాయుడు, తలారి రాధమ్మ, పులి మహాలక్ష్మి, లక్ష్మీదేవి, బొమ్మిశెట్టి పురుషోత్తం, రాటకొండ శ్రీనివాసులు నాయుడు, యర్రబల్లి వెంకటరమణారెడ్డి, కంచర్ల శ్రీనివాసులు నాయుడు, వేణు, డాన్స్ రెడ్డెప్ప పాల్గొన్నారు.



మదనపల్లె : మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

- తాళం వేసిన ఇల్లే టార్గెట్
- రూ.కోటి విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్‌పి విద్యా సాగర్‌నాయుడు

మాట్లాడుతున్న ఎస్‌పి విద్యా సాగర్ నాయుడు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాత్రిపూట తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా ముఠాను అరెస్టు చేసి వారి వద్దనుండి కోటి రూపాయలకు పైగా విలువ చేసే బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు అన్నారు. గురువారం జిల్లా పోలీసులు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అయన మాట్లాడుతూ ఇద్దరు యువకులు ఓ నేరచరిత్ర గల వ్యక్తితో కలిసి ఈ దొంగతనాల ముఠాను ఏర్పరచుకున్నారని చెప్పారు. గోదావరి జిల్లా లక్కవరానికి చెందిన తోట శివకుమార్, చిత్తూరు జిల్లా మొరవారిపల్లికు చెందిన జెట్టి సుబ్రమణ్యం, అన్నమయ్య జిల్లా, మాధవరంపాడుకు చెందిన నిందితుల నుంచి దాదాపు కోటి రూపాయలు విలువ చేసే కిలో బంగారం, రూ. 3 లక్షలు విలువ చేసే మూడు కిలోల వెండి, రూ.1.4 లక్షల నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, ఓ ఆటోను స్వాధీనం చేసుకున్నామనారు. వీరు గతంలో విజయవాడ, గుంటూరు, తాడేపల్లిగూడెం, అనకాపల్లి, రాజంపేట తదితర ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడి 150కిపైగా కేసుల్లో నిందితులుగా ఉన్నారని తెలిపారు. అన్నమయ్య జిల్లా, మున్నూరు పిఎస్‌లో నమోదయిన కేసులో ఈ నెల 21న తేదీన రాజంపేట మండలం, ఊటుకూరు వద్ద వీరిని అరెస్టు చేశామన్నారు. రాజమండ్రి జిల్లాలోని బొమ్మరులో ఒకటి, నక్కపల్లిలో ఒకటి, తిరుపతి జిల్లా లోని తిరుచానురులో 5, అన్నమయ్య జిల్లాలలోని పీలేరులో 2, రాయచోటిలో 1, రాజంపేటలో 2, ఒబులవారిపల్లి 1, మున్నూరు లో 4 కేసులకు సంబంధించి బంగారు, వెండిఆభరణాలు బయటపడ్డాయన్నారు. ఈ కేసును ఛేదించడంలో రాజంపేట సబ్ డివిజన్ ఎఎస్‌పి మనోజ్ రామనాథ్ హెగ్డే, మన్నూరు ఇన్‌స్పెక్టర్ కుళాయప్ప, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్‌ఐలు మహేష్, రామకృష్ణారెడ్డి కీలకంగా పనిచేసిన వారిని ఎస్‌పి అభినందించారు. ప్రజలు తమ ఇళ్ల పరిసర ప్రాంతాల్లో సిసి టివి ఏర్పాటు చేసుకవాలన్నారు. విలువైన వస్తువులు బ్యాంకు లాకర్‌లో భద్ర పరచుకోవాలన్నారు. అపరిచితుల కదలికలపై నిఘా, అనుమానం వచ్చిన వెంటనే డైల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సి ఐలు, ఎస్‌ఐలు, పోలీస్ కానిస్టేబుల్, సిబ్బంది పాల్గొన్నారు.

మధుర గీతాల సామ్రాట్ వేటూరి

- ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

వేటూరి సుందర రామమూర్తి దివి నుంచి భువికేగినా ఆయన పాటలు అజరామరాలని, నిత్యం తెలుగువారి నాలుకలపై సుస్వరాలని, ఇటు క్లాస్ అటు మాస్ పాటలతో పాటు శృంగార గీతాలు రాయడంలో ఆయన సామ్రాట్ అని వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. రచయితల సంఘం ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం కార్యాలయంలో వేటూరి సుందర రామమూర్తి 15వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మొదట ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ 'ఓ సీత కథ' సినిమాతో ప్రారంభించి కొన్ని వందల సినిమాల్లో దాదాపు తొమ్మిది వేల పైగా పాటలు రాశారని, శంకరాభరణం, సాగర సంగమం, సప్తపది వంటి సినిమాల్లో రాసిన సంప్రదాయ పాటలతో పాటు అడవి రాముడు, జగదేకవీరుడు- అతిలోకసుందరి వంటి వందల సినిమాల్లో శృంగార భరితమైన పాటలు రాశారని, శ్రీ శ్రీ తరువాత తెలుగు పాటకు అంతర్జాతీయ కీర్తినార్జించినది సుందర రామమూర్తి పేర్కొన్నారు. కవి డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ వేటూరి వారు సీనియర్ ఎన్టీఆర్ మొదలుకుని నాగేశ్వరరావు, కృష్ణ, శోభన్ బాబు, కృష్ణంరాజు, చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్ మొదలైన ఎంతోమంది నటుల కోసం ఆయన సూపర్ హిట్స్ అందించారని పేర్కొన్నారు. బద్రీనాథ్ సినిమాలో ఓంకారేశ్వరి అనే పాటలో 108 వైష్ణవ దివ్య స్థలాలను వ్యక్తపరచిన తీరు అద్భుతమని, ఆయన రాసిన పాటలు పండితుల నుంచి పామరుల వరకు అందరినీ అలరించి ఆనందపరిచాయని తెలిపారు. వేటూరి పాటలు తర్వాత తరాల వారికి కూడాఎంతో స్ఫూర్తిదాయకంగా నిలిచాయని చెప్పారు. కార్యక్రమంలో బ్యాంకు గంగయ్య, తుపాకుల నారాయణ, సివి.కృష్ణయ్య, కె.వి.సుబ్బ రాయుడు, కె.సి.పుల్లయ్య, సోము వెంకటసుబ్బయ్య, బి.రామమోహన్‌రెడ్డి, ఎం.సుబ్బరాయుడు, జి.పుల్లయ్య, వర్మ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

గృహ నిర్మాణ లక్ష్యాల ప్రగతి సాధించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

గృహ నిర్మాణ లక్ష్యాల అధికారులు ప్రగతి సాధించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. గురువారం కలెక్టరేట్ నుండి సబ్ కలెక్టర్లు, ఆర్‌డిఒ, జిల్లా అధికారులు, స్పెషల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఇఒ ఆర్‌డిలు, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది, పాఠశాలల పిఇటిలు తదితరులతో యోగాంధ్ర 2025 మాసోత్సవాల నిర్వహణ, తడి పొడి చెత్తల సేకరణ, ఆర్‌టిసి బస్టాండ్లలో మెరుగైన వసతుల కల్పన, గృహ నిర్మాణాలలో ప్రగతి, పౌరసరఫరాలు తదితర అంశాలలో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి చేపట్టాల్సిన పనులపై దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 500 గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలలో ప్రతిరోజు చెత్త సేకరణ చేయాలని తెలిపారు. తడి పొడి చెత్తలను విడిగా సేకరించాలని, ఈ దిశగా ప్రజలలో అవగాహన పెంపొందించాలని పేర్కొన్నారు. చెత్త సేకరణకు గ్రీన్ అంబాసిడర్‌లను అవసరమైన మేర ఎక్కువ సంఖ్యలో నియమించుకోవాలని సూచించారు. చెత్త సేకరణపై కూడా ప్రభుత్వం ఐవిఆర్ఎస్ ద్వారా మీ ఇంటికి చెత్త సేకరించడానికి ఎవరైనా వస్తున్నారా, లేదా అని, వారానికి రెండు రోజులు తప్పకుండా వస్తున్నారా అని రెండు అంశాలలో ప్రజల నుండి అభిప్రాయాలు సేకరిస్తోందని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఈవోపీఆర్డీలు చెత్త సేకరణ పై దృష్టి పెట్టాలన్నారు. మండల స్పెషల్ అధికారులు ఎంపిడిఒలు ప్రతిరోజు చెత్త సేకరణపై తగువిధంగా పర్యవేక్షణ చేయాలన్నారు. తడి పొడి చెత్త లను వేరువేరుగా ఇచ్చేలా ప్రజలలో అవగాహన కలిగేలా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని అన్ని ఆర్‌టిసి బస్టాండ్లలో మెరుగైన వసతులు కల్పించాలని చెప్పారు. బస్టాండ్లలో ప్రయాణికులకు ఫ్యాన్లు, తాగునీరు, మరుగుదొడ్లు అందుబాటులో ఉంచాలని, బస్టాండ్ పరిసరాలలో క్రమం తప్పకుండా పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ బాగుండాలని సూచించారు. బస్సుల రాక పోకల సమయాలను తెలిపే బోర్డులను అందరికీ తెలిసేలా ప్రదర్శించాలన్నారు. అనంతరం వివిధ అంశాల్లో తగు సూచనలు జారీ చేశారు. జిల్లాలో ఇంటి నిర్మాణానికి సంబంధించి స్టేజ్ వారి బిల్లు చెల్లించినా కూడా 66 సచివాలయాల పరిధిలో గత 60 రోజుల నుంచి జీరో శాతం ప్రగతి ఉందన్నారు. ఇండ్ల నిర్మాణాలకు సంబంధించి ఇచ్చిన లక్ష్యం మేరకు తప్పనిసరిగా ప్రగతి సాధించాలని, ప్రగతి సాధనలో వెనుకబడిన వారిపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఎన్టీఆర్ సామాజిక భరోసా పించన్లను లబ్ధిదారులకు అందజేసే సమయంలో వారి మొబైల్ ఫోన్లను అప్డేట్ చేయాలని పేర్కొన్నారు. పించను పంపిణీ పై కూడా ప్రభుత్వం ఐవిఆర్ఎస్ ద్వారా లబ్ధిదారుల అభిప్రాయ సేకరణ చేస్తుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వంద శాతం ఒకటవ తేదీననే పించన్లను పంపిణీ చేయాలని సూచించారు. పౌరసరఫరాల అంశంపై కూడా కలెక్టరు, జేసీ సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. జూన్ 21న విశాఖపట్నంలో నిర్వహించే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో దేశ ప్రధానమంత్రి పాల్గొంటారు. జిల్లా నుంచి ఆరోజు పది లక్షల మంది యోగా కార్యక్రమంలో పాల్గొనేలా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రజలలో విస్తృతంగా అవగాహన కల్పించాలని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదన్ రావు, సబ్ కలెక్టర్ నైదియాదేవి, ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌ను కలిసిన కేంద్ర బృందం

కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు పచ్చజెండా

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్: కేంద్ర ప్రభుత్వం 2022లో మదనపల్లెకు కేంద్రీయ విద్యాలయ మంజూరు చేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు కేంద్రీయ విద్యాలయ ప్రారంభించుటకు కేంద్రీయ విద్యాలయం సంఘటన్ కేంద్ర కార్యాలయం బృందం గురువారం మదనపల్లెలో సందర్శించింది. డిప్యూటీ కమిషనర్ మంజునాథ్, అసిస్టెంట్ కమిషనర్ అనురాధ నేతృత్వంలోని బృందం సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, తహశీల్దార్ ధనంజయులు, ఇతర జిల్లా అధికారులను కలిశారు. ముందుగా సబ్ కలెక్టర్‌ను కలిసి స్థానిక గిరిజన నివాస పాఠశాల భవనంలో ఈ విద్యా సంవత్సరానికి తరగతులు ప్రారంభించడానికి అవసరమైన అన్ని అనుమతులను అందజేశారు. 2025-26 విద్యార్థుల ప్రవేశ ప్రక్రియను త్వరలో పత్రిక ప్రకటన ద్వారా తెలియజేస్తామని కేవీ బృందం ధృవీక రించారు. అబంతరం శాశ్వత పాఠశాల భవన నిర్మాణ కోసం వలసపల్లె గ్రామం వద్ద మదనపల్లి-పుంగనూరు రహదారి ఆనుకుని ఉన్న నవోదయ పాఠశాల ఎదురుగా 6.09 ఎకరాల భూమిని పరిశీలించి ఖరారు చేశారు. సబ్ కలెక్టర్, తహశీల్దార్ ధనుంజయులు సమక్షంలో ఈ భూమిని కేంద్రీయ విద్యాలయకు ప్రభు త్వం అప్పగించారు. త్వరలో శాశ్వత భవన నిర్మాణం పనులు ప్రారంభిస్తామని మంజునాథ్ వ్యక్తం చేశారు. ఇక్కడ ఉన్నత ప్రమాణాలతో పాటు ప్రాథమిక విద్య అందించడంతో పాటు క్రీడలు, విలువలతో కూడిన విద్యను బోధిస్తు దేశానికి మంచి పౌరులు అందిస్తామని తెలిపారు.

నైపుణ్యాభివృద్ధికి నిదర్శనం బాలల వేసవి వినోదం

ప్రజాశక్తి- కడప అర్బన్ : నైపుణ్యాభివృద్ధికి నిదర్శనం బాలల వేసవి వినోదం అని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సమీర్ బాష పేర్కొన్నారు. గురువారం జెవివి ఆధ్వర్యంలో 'వేసవి వినోదం' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, ఒరిగామి, క్రీడలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్పోకెన్ ఇంగ్లీష్ తరగతుల్లో ప్రత్యేకంగా బేసిక్ కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అభ్యసించాలని తెలిపారు. క్రాఫ్ట్, ఒరిగామి ద్వారా చేతి పనులకు ప్రోత్సాహం లభించిందని చెప్పారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ఆరోగ్యం లభిస్తుందని పేర్కొన్నారు. క్యాంపులో విద్యార్థులు ప్రదర్శిస్తున్న చురుకుదనం, శ్రద్ధ నిర్వాహకులను ఆకట్టుకుందని తెలిపారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, రిసోర్స్ పర్సన్స్ రంగనాయకులు, గఫూర్ పాల్గొన్నారు

రేపు జెవివి పిల్లల కథ వర్క్‌షాప్

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పిల్లల కథా రచనలు, సృజనాత్మకతను పెంచేందుకు కథా వర్క్‌షాపును కథా వసంతం 2౩25 పేరుతో ఈనెల 24,25 తేదీలలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, ఉపాధ్యక్షులు వేంపల్లి రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా కథా వసంతం షెడ్యూల్ పోస్టర్‌ను గురువారం స్థానిక జెవివి కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యక్రమంలో బాల సాహిత్య రచయితలు, కథా రచయితలు పాల్గొంటున్నారని తెలిపారు. మొదటి రోజు కథల్లో మానవ సంబంధాలు అంశంపై బాల సాహిత్య రచయిత డాక్టర్ శ్రీనివాసమూర్తి కథల్లో పర్యావరణ స్పృహ అంశంపై రచయిత దాదాహయాత్ పాల్గొంటారని తెలిపారు. రెండవ రోజు కథల్లో ఉండాల్సిన సామాజిక అంశాలపై రాష్ట్ర తెలుగు భాష పురస్కార గ్రహీత రచయిత పలమనేరు బాలాజీ, కథల్లో తార్కిక దృష్టి పై జెవివి రాష్ట్ర పబ్లికేషన్స్ కన్వీనర్ డాక్టర్ దార్ల బుజ్జిబాబు పప్పెట్ షోను జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు పి విజయ కథల్లో విజువలైజేషన్ అంశంపై రచయిత్రి మాధవి కళ పాల్గొని పిల్లలకు అనేకంశాలపై తర్ఫీదు ఇస్తారని తెలిపారు. ఈ రెండు రోజులపాటు నిర్వహించే కార్యక్రమాలు రచయితలు పి.చంద్రశేఖర్, కావూరి మారుతి పర్యవేక్షణలో జరుగుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని పిల్లలు ఉపయోగించుకోవాలని కోరారు.

నేడు పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం

మాట్లాడుతున్న గోవిందరాజులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో శుక్రవారం ప్రాంతీయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం నిర్వహించనున్నారు. గురువారం ఉద్యాన కళాశాలలో అధ్యాపకులు, శాస్త్రవేత్తలతో సమావేశమై ప్రాంతీయ పరిశోధన, విస్తరణ సలహామండలి సమావేశ ఏర్పాట్లపై చర్చించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా విశ్వవిద్యాలయం వైఎస్ ఛాన్సలర్ డాక్టర్ కె.గోపాల్, ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ సంచాలకులు డాక్టర్ కె.శ్రీనివాసులు హాజరవు తారని వారు తెలిపారు. వీరితో పాటు పరిశోధన సంచాలకులు డాక్టర్ కెటి.వెంక టరమణ, విస్తరణ సంచాలకులు డాక్టర్ బి.గోవిందరాజులు, సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ సి.మధుమతి హాజరై ఈ సమావేశాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. రాయలసీమ జిలాల్లో సాగులో ఉన్న వివిధ రకాల ఉద్యాన పంటలు, వాటి సాగుస్థితి గతులు, సమస్యలు, పరిష్కార మార్గాలపై చర్చిస్తారని చెప్పారు. క్షేత్ర స్థాయిలో రైతులు ఎదుర్కొంటన్న సమస్యలపై పరిష్కారం దిశగా తీసుకోవాల్సిన చర్యలు, నూతన పరిశోధనలకు అవకాశం తదితర అంశాలపై చర్చించి భవిష్యత్ పరిశోధన, విస్తరణ కార్యచరణ ప్రణాళిక రూపొందించ నున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన వివిధ కమిటీలు బాధ్యాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశాలకు రాయలసీమ జిల్లాల నుంచి ఉద్యాన శాఖ అధికారు లతో పాటు, ఉద్యాన శాస్త్రవే త్తలు, ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటి సాగు పథ కంలో పని చేసే అధికారులు హాజరవుతారన్నారు. ఈ సమావేశాల్లో చర్చల అనంతరం పరిశోధన, విస్తరణ విభాగాల్లో అంతరాలను గుర్తించి వాటి పరిష్కారానికి కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు.

ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక

ప్రజాశక్తి-చిన్నమండెం

మండలంలోని మల్లూరు గ్రామ సంఘంలో గురువారం గ్రామ స్థాయిలో గ్రామసభను ఏర్పాటు చేసి ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ గురించి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సమావేశం ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులు కు అవగాహన కల్పిస్తూ గంగిరెడ్డిగారిపల్లెలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎపిసిఎన్ఎఫ్ ఆదర్శ రైతుల విజయగాథలను రైతులకు వివరించారు. ఆదర్శ రైతులు డి.వెంకటలక్ష్మమ్మ, అంజనమ్మ వారికి సన్మానాలు చేసి, పిఎండిఎస్ వలన లాభాలు, ప్రయోజనాలు, మోడల్స్ గురించి, కిచెన్ గార్డెన్ గురించి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వై.చలపతి నాయుడు, అరుణ కుమారి తెలిపారు. కార్యక్ర మంలో ఇన్‌ఛార్జి తన్మయి, ఐసిఆ ర్‌పి డి.రామాంజులు, కిరున, టి.రఘు, వెంకట్రామిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పక ధరించాలి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మాట్లాడుతున్న ఎస్ఐ రవీంద్రబాబు

ప్రతి ఒక్క ద్విచక్ర వాహన దారుడు హెల్మెట్‌ను ధరించి ప్రాణాన్ని రక్షించుకోవాలని లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ రవీంద్రబాబు పేర్కొన్నారు. ద్విచక్ర వాహనాన్ని నడిపేటప్పుడు ప్రమాదం కు గురైనప్పుడు హెల్మెట్ ధరించకపోవడం వల్ల చాలా మంది మృతి చెందుతున్నారని అన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ను కచ్చితంగా ధరించాలన్నారు. ఒకవేళ వాహనం నడిపేటప్పుడు మొదటి సారి హెల్మెట్ ధరించకుండా నడిపినట్లయితే వారిపైన చట్ట ప్రకారం అపరాధ రుసుం వేయడం జరుగుతుందని , రెండవ సారి కూడా హెల్మెట్ లేకుండా నడిపితే ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. కాబట్టి ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను ధరించి వాహనాన్ని నడపాలని పేర్కొన్నారు.

చిన్నారుల గుర్తింపునకు సర్వే

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని విభిన్న ప్రతిభావంత చిన్నారులను గుర్తించేందుకు సర్వే చేపడుతున్నట్లు జిల్లా ఎంఎస్ఐ, ప్లానింగ్ కో-ఆర్డినేటర్ లక్ష్మీ నరసింహ రాజు తెలిపారు. గురువారం వేంపల్లెలో జరుగుతున్న సర్వేను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ నరసింహరాజు మాట్లాడుతూ సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్, ఎంఇఒల ఆదేశాలతో ఈనెల 13 నుంచి జూన్ 10వ తేదీ వరకు విభిన్న ప్రతిభావంతుల సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బడి బయట, 5 సంవత్సరాలలోపు ఉన్న, పాఠశాలలో పేర్లు నమోదు కాని వారిని గుర్తిస్తున్నట్లు పేర్కొన్నారు. వేంపల్లె మండలంలో 8 మంది విభిన్న ప్రతిభావంతులను కొత్తగా గుర్తించామన్నారు. జిల్లాలోని భవిత కేంద్రాలలో విభిన్నప్రతిభావంతుల నమోదు శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలని కోరారు. మండలంలో ఎవరైనా విభిన్న ప్రతిభావంత చిన్నారులు పాఠశాలలో నమోదు కాని వారు ఉంటే భవిత కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. భవిత కేంద్రం ద్వారా అలవెన్సులు, ఆపరేషన్లు, ఉపకరణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐఇఆర్‌టిలు యశోద, సుజాత, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

చర్చి ప్రారంభోత్సవంలో జడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని కూనవారిపల్లె పంచాయతీ పత్తూరులో గురువారం నూతన చర్చిని ప్రారంభించారు. ఈ సందర్భంగా చర్చిని విద్యుద్దీపాలతో అలంకరించారు. క్రైస్తవ గురువులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో జడ్‌పి చైర్మన్ గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి, వైసిపి జిల్లా జాయింట్ సెక్రెటరీ రాఘవరెడ్డి, కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు భూమన సుబ్బారెడ్డి, దుంపలగట్టు సర్పంచ్ రెడ్యం రామకృష్ణారెడ్డి, డిఎల్ శ్రీనివాసులు రెడ్డి, కొత్తపేట సిద్ధారెడ్డి పాల్గొన్నారు.

ఎండియు వాహనాల రద్దు అన్యాయం

- వైసిపి పట్టణ అధ్యక్షుడు జయరామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఇంటింటి వద్దకు రేషన్ సరఫరా చేస్తున్న ఎండియు వాహనాలు రద్దు చేయడం వల్ల ప్రజలకు, వాటి ఆపరేటర్లకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వైసిపి పట్టణ అధ్యక్షుడు జయరామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. వైసిపి కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ రేషన్ లబ్ధిదారులు కూలి పనులు చేసుకునే వారేనని, పనులు మానుకొని రేషన్ షాపు వద్దకు రెండు, మూడు రోజులు తిరగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండియు వాహనాలు ఉంటే పనులు ముగించాక సాయంత్రం వేళల్లో రేషన్ తీసుకునేవారని తెలిపారు. ఎండియు వ్యవస్థలో లోపాలు ఉంటే సరి చేయాలని సూచించారు. వ్యవస్థను రద్దు చేయడం కూటమి ప్రభుత్వానికి తగదని సూచించారు. గత ప్రభుత్వంలో ఉన్న సంక్షేమ పథకాలు ఏవీ అమలు చేయడం లేదని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో అధికారంలోకి అమలు చేయలేదని విమర్శించారు. రేషన్ కార్డులో లబ్ధిదారుల నూతన పేర్ల నమోదు ప్రారంభించి, పత్రాల పేరుతో షరతులు పెట్టి వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఆధార్ ద్వారా రేషన్ కార్డులో పేర్లను నమోదు చేయాలని సూచించారు. స్థానిక సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. ఇటీవల పన్నులు పెంచి ప్రజలపై అధిక భారం వేస్తున్నారని విమర్శించారు. వైసిపి నాయకులపై తప్పుడు కేసులు బనాయిస్తూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణిని ప్రదర్శిస్తుందని విమర్శించారు.

శాశ్వత కూరగాయల మార్కెట్ ఏర్పాటు కలేనా..!

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో కూరగాయల మార్కెట్‌కు స్థల కేటాయింపులు లేకపోవడంతో రైతులు, వ్యాపారులు నానా అవస్థలు పడుతున్నారు. మైదుకూరు మండల పరిధిలో టమోటా, పచ్చిమిర్చి తదితర కూరగాయలు, ఆకుకూరలు రైతులు అధికంగా సాగు చేపడతారు. వాటి విక్రయానికి మైదుకూరు, ప్రొద్దుటూరు ప్రాంతాలకు తరలిస్తుంటారు. మైదుకూరులోని వనిపెంట రోడ్డులో ప్రస్తుతం మార్కెట్ కొనసాగుతోంది. మార్కెట్‌కు ప్రత్యేక స్థలం కేటాయింపు లేకపోవడంతో రోడ్డుపైనే దుకాణాలు ఏర్పాటు చేసుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. అంకాలమ్మ గుడి సమీపంలో రైతులు అమ్మకాలు చేపడుతున్నారు. ఈ ప్రాంతంలో కుళ్లిన కూరగాయలు అధికంగా వేస్తుండడంతో దుర్వాసన వెలువడుతోంది. వర్షం వస్తే పరిస్థితి మరింత అధ్వానంగా తయారవుతోంది. రోడ్డు వెంబడి దుకాణాలు దూరంగా ఉంటున్నాయి. కూరగాయల మార్కెట్‌కు ఒక ప్రదేశంలో స్థలం కేటాయిస్తే ఉపయోగంగా ఉంటుంది. గత ప్రభుత్వంలో పశువుల సంతను గజ్జి తిప్ప వద్దకు తరలించి పశువుల సంత స్థానంలో కూరగాయల మార్కెట్ గదులను ఏర్పాటు చేసేందుకు పనులు ప్రారంభించారు. అవి పూర్తి కాకపోవడం నూతన ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్లీ సంతను పాత ప్రాంతానికి తరలించారు. ఈ నేపథ్యంలో మార్కెట్ స్థల కేటాయింపు ప్రశ్నార్థకంగా మారింది. మున్సిపాలిటీ పరిధిలో కూరగాయల మార్కెట్‌కు ప్రత్యేక స్థలాన్ని ఏర్పాటు చేసి దుకాణాలను ఏర్పాటు చేస్తే రైతులు, వ్యాపారులు, ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు సూచిస్తున్నారు. కూరగాయల మార్కెట్‌కు స్థలాన్ని కేటాయిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో మార్కెట్‌కు, ఆటో స్టాండ్ ఏర్పాటు లేదు. ప్రజల మీద మాత్రం మున్సిపాలిటీ పన్ను అధికంగా వసూలు చేస్తోంది. మున్సి పాలిటీ పరిధిలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కువైట్ నుంచి వస్తూ రాంనగర్ వాసి మృతి

-చివరి చూపు కోసం కుటుంబ సభ్యుల ఆవేదన

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మనోహర్ కోసం రోదిస్తున్న కుటుంబ సభ్యులు

స్థానిక పట్టణంలోని రాంనగర్‌కు చెందిన రాజబోయిన మనోహర్(40) బతుకుదెరువు కోసం కువైట్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా విమానంలో పక్షవాతం రావడంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. జీవనోపాధి కోసం కువైట్ వెళ్లిన మనోహర్ ఈనెల 17న శ్రీలంక ఎయిర్ లైన్స్ విమానంలో భారత్‌కు పయనమై మార్గమధ్యంలో పక్షవాతానికి గురై అకస్మాత్తుగా మృతి చెందాడని తెలిపారు. మృతుడి కడసారి చూపు కోసం వారి కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. మనోహర్ భార్య రాజేశ్వరి కుటుంబ సభ్యులతో కలిసి గురువారం పాత్రికేయులను ఆశ్రయించి తన గోడు వెళ్ళబోసుకున్నారు. కువైట్ వెళ్లి ప్రతి రెండేళ్లకోసారి ఇండియాకు వచ్చే వాడని తెలిపారు. ఈనెల 17న తిరిగి వస్తున్నట్లు ఫోన్ ద్వారా తమకు తెలిపాడని అన్నారు. ఐదు రోజులు గడిచినప్పటికీ తాను ఇండియాకు చేరుకోలేదన్నారు. తన భర్త అనారోగ్యంతో విమానంలోనే మృత్యువాత పడి శ్రీలంక దేశంలోనే కొలంబో ఆస్పత్రిలో మృతదేహం ఉన్నట్లు సమాచారం అందిందని తెలిపారు. మృతదేహాన్ని అప్పగించాలంటే రూ 2.50 లక్షలు కొలంబో ఆసుపత్రికి చెల్లించాలని సూచిం చడంతో భర్త సంపాదనపైన ఆధారపడి జీవిస్తున్న తాము అంత మొత్తాన్ని చెల్లించలేమని విలపించారు. తన భర్తను కడసారి చూసుకునేందుకు సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవ తీసుకుని సాయం అందించాలని కోరుతున్నారు. మృతుడికి ఇంటర్మీడియట్ చదివే కుమారుడు, ఆరవ తరగతి చదివే కుమార్తె, వివాహమైన మరో కుమార్తె ఉన్నారు. తన తండ్రి కడసారి చూపు కోసం పిల్లలు రోదిస్తున్న తీరు వర్ణనాతీతం. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని మనోహర్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించాలని స్థానికులు సైతం కోరుతున్నారు.

జవాన్ మృతికి సంఘీభావంగా తిరంగా ర్యాలీ

ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాసంఘాలు, ప్రజలు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ఇటీవల భారత్-పాకిస్తాన్ మధ్య జరిగిన ఆపరేషన్ సింధూర్‌లో మృతి చెందిన జవాన్ మురళీనాయక్‌కు సంఘీభావంగా మండల కేంద్రం లక్కిరెడ్డిపల్లిలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. టిడిపి నాయకులు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీని నిర్వహించారు. మండలంలోని కుల మతాలకు అతీతంగా ప్రజలందరూ ఎనలేని దేశభక్తిని చాటుతూ ఉగ్రవాద కాల్పుల్లో మృతి చెందిన అమరులైన భారత జవాన్లను స్మరించుకుంటూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి మండల యువ నాయకుడు యనమల మదన్మోహన్, మాజీ రెడ్డెయ్య యాదవ్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కొండూరు వెంక ట్రామరాజు, రాజంపేట డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎండి షఫీనాయక్, షేక్ఆరీఫ్,మసూద్, ముక్తార అహ్మద్, కూటమి నాయకులు, అధికారులు, అంగన్వాడీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

పేదలకు వరం సిఎం సహాయనిధి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అనారోగ్యం కారణంగా అనేక రకాలుగా బాధించబడిన కుటుంబా లకు సిఎం సహాయనిధి భరోసాగా నిలబడుతుందని జనసేన పార్టీ రాజంపేట పార్లమెంటు ఇన్‌ఛార్జి యల్లటూరు శ్రీనివాసరాజు తెలిపారు. గురువారం మన్నూరులోనే ఎల్లమ్మ ఆలయం సమీపంలో గల యల్లటూరు భవన్‌లో మండ ల పరిధిలోని భువనగిరి పల్లెకు చెందిన నవ్యశ్రీకు రూ 42,850 లు సిఎం సహాయ నిధి చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎల్లప్పుడూ అండగా నిలబడుతుందని అన్నారు. ప్రజలకు సేవ చేసేందుకే తాను రాజకీయాల్లోకి వచ్చానని, ఎవరికి ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అందుబాటులో ఉంటానని అన్నారు. తనకు ఆసరాగా, అండ గా నిలిచిన శ్రీనివాసరాజు, కూటమి ప్రభుత్వానికి తాను రుణపడి ఉంటానని నవ్య శ్రీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కోలాటం హరి, సుధాకర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు చెక్కును అందిస్తున్న శ్రీనివాసరాజు

రక్తపోటు పట్ల అప్రమత్తంగా ఉండాలి : డిఎంహెచ్ఒ

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి నాగరాజు

ప్రజాశక్తి - చాపాడు

గర్భిణులు బిపి (రక్తపోటు) పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు సూచించారు. గురువారం స్థానిక పీహెచ్సీలో ప్రీ ఎక్లియాపిసిల్ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ గర్భం దాల్చిన నాటి నుండి 20 వారాలపాటు బిపిని అదుపులో ఉంచుకోవాలన్నారు. ఏదైనా సమస్య ఏర్పడితే పుట్టబోయే బిడ్డపై ప్రమాదం ఉంటుందన్నారు. తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. సిబ్బంది కూడా గర్భిణుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిఐఎఒ ఉమామహేశ్వర్, డిప్యూటీ డిఎంఎస్ మల్లేశ్, మండల వైద్యాధికారి రాజేష్ కుమార్, డాక్టర్ ఓబులేసు, సిబ్బంది, ఎఎన్ఎంలు, గర్భిణులు పాల్గొన్నారు.

ముద్దనూరు : గర్భిణులు ప్రసవ సమయం వరకు జాగ్రత్తలు తీసుకోవాలని పిహెచ్‌సి వైద్యాధికారి నాగార్జున్ సూచించారు. స్థానిక పిహెచ్‌సిలో గురువారం నాగార్జున్ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రీ ఎక్లాంసియా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు అవగాహన కల్పించారు. క్రమంగా వైద్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్ యాదవ్, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, సూపర్‌వైజర్ రామారావు, వైద్య సిబ్బంది ఇందిరమ్మ, ముస్కిన్ బి, ఆశా కార్యకర్తలు నీలవేణి, చంద్రబాయ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైద్యాధికారి నాగార్జున్

నాపరాయి పరిశ్రమల అడ్వయిజరీ కమిటీ ఎన్నిక

అడ్వయిజరీ కమిటీ ఎన్నికలో యజమానులు, ఎపిఐఐసి అధికారులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల నాపరాయి పరిశ్రమలకు సంబంధించి ఐపి పార్క్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అడ్వయిజరీ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎపిఐఐసి డిప్యూటీ జోనల్ మేనేజర్ (ఐలా కమిషనర్) కమలాకర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. కమిటీలో జె.లక్ష్మీసుజాత, వై.అంజనమ్మ, జి.పెద్దిరెడ్డి, కె.రామమునిరెడ్డి, వై.రామఓబులరెడ్డితోపాటు మరో ఐదు మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఎపిఐఐసి జోనల్ మేనేజరు కె.శ్రీనివాసమూర్తి, డిప్యూటీ జోనల్ మేనేజర్ పి.కమలాకర్, సర్వేయర్ ఎం.ఎన్.ప్రసాద్‌రెడ్డి కమిటీ సభ్యులుగా ఉంటారు. ప్రస్తుతం వీరు ఆరు నెలల వరకు కార్య నిర్వాహకులుగా ఉంటారు. ఈ లోపు యాజమాన్యం కమిటీని ఎన్నుకుంటుంది. ఇందులో చైర్మన్, వైస్ చైర్మన్ వంటి పదవులు కేటాయించనున్నారు. ఎపిఐఐసి ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ ఎస్టేట్ 43.17 ఎకరాల స్థలంలో 1977లో ప్రారంభించారు. ఇప్పటివరకు ఎపిఐఐసి ఐలా ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయలేదు. స్థానికంగా ఒక అసోసియేషన్ ఉండేది. మాజీ సర్పంచ్ రవిప్రసాద్ రెడ్డి అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహించేవారు. ప్రస్తుతం ఎపిఐఐసి ఆధ్వర్యంలో నూతన కమిటీ ఏర్పడింది. ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ స్థానికంగా ఎపిఐఐసి ఐలా ఆధ్వర్యంలో 68 నాపరాయి యూనిట్లు ఉండగా.. 50 మంది మాత్రమే టాక్స్ చెల్లిస్తున్నారని తెలిపారు. మిగతా 18 మంది కూడా టాక్స్ చెల్లించాలని సూచించారు. ప్రస్తుతం ఏడారికి రూ.2,36,000 టాక్స్ చెల్లింపులు అవుతున్నాయని మరో రూ.2.5 లక్ష బకాయి ఉందన్నారు. ఎపిఐఐసి ఐలా అకౌంట్లో సుమారు రూ.7 లక్షలు ఉందని తెలిపారు. నూతన కమిటీ వల్ల స్థానికంగా అనేక ప్రయోజనాలు ఉంటాయని వివరించారు. కమిటీ ఆధ్వర్యంలో స్థానికంగా వీధిలైట్లు, పొల్యూషన్, రోడ్లు, డ్రయినేజీ, కనీస వసతులకు సంబంధించి ఏదైనా సమస్యలు ఉంటే ప్రధాన కార్యాలయానికి రాయడం ద్వారా కానీ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం ద్వారా గానీ పరిష్కరించుకోవచ్చని తెలిపారు. నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎపిఐఐసి ఐలా సర్వేయర్ ప్రసాద్‌రెడ్డి, సిబ్బంది, నాపరాయి పరిశ్రమల యజమానులు నిడిజి రాజారెడ్డి, వీరారెడ్డి, ముత్తు, రాంప్రసాద్‌రెడ్డి, ప్రసాద్ నాయుడు, కృష్ణారెడ్డి, రామసుబ్బారెడ్డి, మునిరెడ్డి, రమణారెడ్డి, ప్రతాపరెడ్డి, శ్రీను, భాస్కరయ్య, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

నాడు మహా మోసం.. నేడు మహానాడు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఆనాడు మామ ఎన్‌టిఆర్‌ను వెన్నుపోటు పొడిచి మహా మోసం చేసి.. నేడు మహానాడు నిర్వహించడం చంద్రబాబు నాయుడుకే చెల్లిందని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజల సౌకర్యార్థం ప్రవేశపెట్టిన పథకాలన్నిటిని ఒకొక్కటిగా కూటమి ప్రభుత్వం రద్దు చేస్తూ వస్తోందన్నారు. జగన్ పాలనలో అవసరమైన సర్టిఫికెట్లకు దగ్గరలోనే సచివాలయాలు ఉండేవని, ఇంటింటికి తిరిగి ప్రతి 6నెలలకోసారి కొత్త పించన్లు మంజూరయ్యేవని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఒకొక్కటిగా ఆ సంక్షేమ పథకాలన్నీ రద్దు చేస్తోందని విమర్శించారు. ఇంటింటికి పోయి రేషన్ ఇస్తే ప్రభుత్వానికి వచ్చే నష్టం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఇంటింటికి తిరిగి చెత్తను సేకరిస్తే ఆ బండి ద్వారా ప్రభుత్వానికి వచ్చే నష్టం ఏంటని అన్నారు. జగన్ పాలన కనిపించకుండా ఉండాలనేది చంద్రబాబు ఉద్దేశమన్నారు. చంద్రబాబుకు ఎందుకు ఓటేసి గెలిపించామా అని ప్రజలు ప్రస్తుతం ఆలోచనలో పడ్డారన్నారు. అమరావతి నిర్మాణం, పోలవరం పూర్తి, పరిశ్రమల రాక ఇలాంటి సొల్లు కబుర్లు చెప్పడం తప్ప రాష్ట్రంలో జరిగింది ఏమీ లేదన్నారు. చేసుకున్న వాళ్లకు చేసుకున్నంత అని పేద ప్రజలు నిట్టూరుస్తున్నారని రాచమల్లు పేర్కొన్నారు.

మహాభారత యుద్ధంలో హరికథ గానం చేస్తున్న జ్యోత్స్న

పీలేరులో మహాభారత యజ్ఞం

ప్రజాశక్తి-పీలేరు

పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలో మహాభారత యజ్ఞ మహోత్సవం ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక ఆర్‌టిసి గ్యారేజ్ సమీపంలోని ఖాళీ స్థలంలో గురువారం టిటిడి అన్నమాచార్య ప్రాజెక్ట్ భాగవతారిణి, గానప్రవీణ ఇ.జ్యోత్స్న ఆలకించిన సర్పయాగం హరికథా కాలక్షేపంతో మహాభారతయజ్ఞ మహోత్సవానికి శ్రీకారం చుట్టారు. పగటిపూట హరికథా కాలక్షేపం గురువారం జూన్ 8 వరకు నిర్వహించనున్నారు. ఈనెల 24 నుంచి ప్రతి రోజూ రాత్రి 9 గంటలకు శ్రీవేంకటేశ్వర నాట్య కళామండలి బృందం చే నాటక ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఆర్‌టిసి, విద్యుత్ శాఖ, పోలీసు వారి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ మహాభారత యజ్ఞం కార్యక్రమాన్ని పీలేరు గ్రామ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు. హరికథా కాలక్షేపానికి పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామ్మూర్తి, టిడిపి మహిళా నాయకురాలు రమాదేవి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.

పుల్లూరు మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి - ఖాజీపేట

పుల్లూరు మాజీ సర్పంచ్ ఇరగంరెడ్డి లక్ష్మీదేవి అనారోగ్యంతో గురువారం రహమత్‌ఖాన్‌పల్లెలో మృతి చెందారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేది. లక్ష్మీదేవి మృతి పట్ల గ్రామస్తులు కుటుంబ సభ్యులు సంతాపం తెలిపారు. ఆమె కుమారుడు ఇరుగంరెడ్డి నాగేశ్వర్‌రెడ్డి వైసిపి మండల ముఖ్య నాయకుడిగా కొనసాగుతున్నారు. వైసిపి నాయకులు లక్ష్మీదేవి మృతదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. పంచాయతీ అభివృద్ధికి ఆమె ఎంతగానో కృషి చేశారని పలువురు కొనియాడారు.

యువ రచయితలకు దీపదారి 'కేతు'

ప్రజాశక్తి - చాపాడు

ఆధునిక సాహితీ లోకంలో యువ రచయితలకు ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి దీపదారి అని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య పేర్కొన్నారు. మైదుకూరు జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో గురువారం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, సాహిత్య విమర్శకులు, అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర పూర్వ అధ్యక్షులు ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి వర్ధంతి సభను ఏర్పాటు చేశారు. రచయిత, చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తవ్వా మాట్లాడుతూ రచయితను దృష్టిలో ఉంచుకొని సాహిత్య విమర్శ చేయ కూడదని కేతు తనకు చెప్పేవారని గుర్తు చేశారు. సభాధ్యక్షుడు బొమ్మిశెట్టి రమేష్ మాట్లాడుతూ వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకొని రుజుమార్గంలో వాడుకొని తెలుగు భాషాభివృద్ధికి కేతు తన జీవితాన్ని ధారపోశారని తెలిపారు. కేతు కథలలో పీర్ల చావిడి అత్యంత ప్రచుర్యం పొందిందన్నారు. హిందీ, బెంగాలీ, మలయాళం, మరాఠీ, కన్నడ, ఇంగ్లీషు, రష్యన్ భాషల్లో అనువాదం పొందిన తెలుగు కథ కేతుదని తెలిపారు. కార్యక్రమంలో రాటా అధ్యక్షుడు కొండపల్లి శేషగిరి, విశ్రాంత ఉపాధ్యాయులు పొలిమేర ఓబన్న, రచయిత తోట రామ్మోహన్, సాహితీప్రియులు గోసుల వీర రాఘవరెడ్డి, డి.వెంకట రమణారెడ్డి, చిత్రకారుడు కైఫ్ బాలరాజు (బాలు), భాస్కర్, సురేష్ పాల్గొన్నారు.

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని బైఠాయింపు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

నిరసన వ్యక్తం చేస్తున్న ఖాజా

ప్రొద్దుటూరు అం జుమన్ కమిటీ ఎన్నిక పార దర్శకంగా నిర్వహించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ ఖాజా అన్నారు. ఎన్నిక నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించారని నిరసిస్తూ ఖాజా గురువారం ఇస్లాంపురం మసీదులో బైఠా యించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంజు మన్ కమిటీ ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా కమిటీకి అనుసంధానంగా ఉన్న మసీ దుల నుండి ఇద్దరు వ్యక్తులను ఎంపిక చేసి పంపాల్సి ఉందన్నారు. 12వ వార్డు ఇస్లాంపురం మసీదులో ఎన్నికకు అవసరమైన నిబంధనలకు విరుద్ధంగా మసీదులో ఎన్నిక నిర్వహించి ఎలాంటి బహిరంగ ప్రకటన చేయకుండా స్వార్థపూరితంగా వ్యవ హరించారన్నారు. ఇప్పటికైనా బహిరంగ ప్రకటన చేసి పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని ఆయిల్ మిల్ ఖాజా కోరారు.

సోమేపల్లి అశోక్‌కు 'యోగా ఎక్సలెన్స్' అవార్డు

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలో యోగా థెరపిస్టుగా పని చేస్తున్న సోమేపల్లి అశోక్‌కు జాతీయ స్థాయిలో ఎక్సలెన్స్ అవార్డు దక్కింది. యోగాకాన్-2025 సందర్భంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నో నగరంలోని కైసర్‌బాగ్‌లోని గాంధీ భవన్ ఆడిటోరియంలో జరిగిన జాతీయ సదస్సుతో పాటు అవార్డు కార్యక్రమంలో సోమేపల్లి అశోక్‌ను యోగ ఎక్సలెన్స్ అవార్డుతో ఘనంగా సత్కరించారు. రుషికుల్ యోగపీఠ్ ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం యోగా ప్రచార విధానాన్ని ప్రోత్సహించేందుకు, రానున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంగా 2025 సందర్భంగా ఈ అవార్డులను ప్రదానం చేసినట్లు అవార్డు గ్రహీత సోమేపల్లి అశోక్ తెలిపారు. దేశం నలుమూలల నుండి వచ్చిన యోగా నిపుణులు, ఇన్‌స్ట్రక్టర్లు, థెరపిస్టుల మధ్య మానవాళి కోసం చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా అవార్డు దక్కడం గర్వకారణంగా నిలిచిందని తెలిపారు. అవార్డుతో యోగా రంగంలో సేవలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందినట్లు చెప్పారు. విద్యార్థులలో యోగా ద్వారా స్మార్ట్ ఫోన్లను అధికంగా వాడడం తగ్గించి విద్యా విషయాలలో ఆసక్తి పెంచడం అనే అంశంపై ఆంధ్రా విశ్వవిద్యాలయం యోగ విభాగంలో తాను పిహెచ్‌డి పరిశోధన చేస్తున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్

మోటార్ల కేబుల్ వైర్లు చోరీ

ప్రజాశక్తి-గుర్రంకొండ

మోటార్‌ను చూపిస్తున్న రైతు

మండలంలోని టి.రాచపల్లి గ్రామంలో నలుగురు రైతు లకు సంబంధించిన బోరుబావుల ఉన్న కేబుల్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు దోచుకెళ్లారు. ఈ సందర్భంగా బాధిత రైతులు సురేంద్రరెడ్డి, సిద్ధమల్లురెడ్డి, రఘు నాథరెడ్డి, బొల్లి రమేష్‌బాబు మాట్లాడుతూ గుర్తు తెలియని దుండగులు ఆరు బోరు బావి మోటర్లు, కేబుల్ వైర్లను కత్తిరించు తీసుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. పొలాలకు నీటి కోసం ఎన్నో వ్యయ ప్రయాసాలతో బోర్లను ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. ఈ ఘటనపై గుర్రంకొండ పోలీసులకు ఫిర్యాదు చేశా మని తెలిపారు. చోరీకి పాల్పడిన వారిని గుర్తించి న్యాయం చేయాలని కోరారు.